క్లుప్తంగా

నేడు సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

మాడుగుల రూరల్: కేజే పురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల సుబ్రమణ్య స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు తెలిపారు. ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, హోమాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

చోడవరం రూరల్: ప్రభుత్వ పింఛన్ పొందుతున్న వారందరూ లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని చోడవరం సబ్‌ట్రెజరీ అధికారి ఎ.ఎస్. మూర్తి శుక్రవారం తెలిపారు. జనవరి మొదటి వారం నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా అందజేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో గాని, సబ్‌ట్రెజరీలో గానీ సమర్పించవచ్చని సబ్ ట్రెజరీ అధికారి తెలిపారు.

ఐదు గ్రామాల్లో రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

మాకవరపాలెం: మండలంలోని ఐదు గ్రామాల్లో రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది. బూరుగుపాలెం, కొండల అగ్రహారం, పైడిపాల, తూటటిపాల, మాకవరపాలెం గ్రామాల్లో డీలర్లను నియమించనున్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 13 లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 26న రాత పరీక్ష, 27న ఇంటర్వ్యూ ఉంటుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు తెలిపారు. ఇతర వివరాలకు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చీడికాడ మండలంలో...

చీడికాడ: మండలంలోని మూడు రేషన్ డిపోల డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. కోనాం పంచాయతీ పరిధిలో నూతన డిపో, చీడికాడ పంచాయతీలో బీసీ కాలనీలో నూతన డిపో, తురువోలు డిపో–2లకు డీలర్లను నియమించనున్నట్టు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు పెళ్లిరాట



పెళ్లిరాట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చోడవరం: స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉపాలయంలో వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం పెళ్లి రాట వేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, అర్చకులు కొడమంచిల చలపతిరావు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, దేవాదాయశాఖ ఈవో సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు



పూజలు చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు, ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తమ సొంతసొమ్ముతో హెచ్‌ఎం శెట్టి మోహన్, భువనేశ్వరి దంపతులు సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం ఎంఈవో జగ్గారావు, సర్పంచ్ మద్దు అప్పలనాయుడు ప్రతిష్ఠించి ఉపాధ్యాయులతో కలసి పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సబ్బవరపు పెద్దినాయుడు, గొల్లు రాజబాబు పాల్గొన్నారు.

నేడు అన్ని పాఠశాలల్లో సమావేశాలు

చోడవరం రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల ఏర్పాట్లను పరిశీలించడానికి అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఎల్.రామారావు, మండల అభివృద్ధి అధికారి పి.వి.జె. ఆంజనేయులు, మండల విస్తరణాధికారి ఓ.మహేష్, మండల విద్యాధికారి కె.సింహాచలం, సబ్‌ఇన్‌స్పెక్టర్లు డి.నాగకార్తీక్, బి.జోగారావులతో బృందాన్ని ఏర్పాటు చేశారు.

వేరుశనగ సాగు... లాభాలు బాగు

- రబీ సీజన్‌కు సన్నద్ధం
- రాయితీపై విత్తనాల పంపిణీ
- వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం



వేరుశనగ సాగు(ఫైల్)



వారాడలో నాట్లకు దుక్కులు చేసిన పొలం.



గుల్లేపల్లి రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తనాలను అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు

కె.కోటపాడు :రబీ సీజన్‌లో వేరుశనగ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో గల గరువు నేలతో పాటు ఖరీఫ్‌లో సాగుచేసిన వరి కోతలు పూర్తి చేసిన పొలాల్లో దుక్కులు నిర్వహించి వేరుశనగను వేసేందుకు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇటీవల బంగాళాఖాతాలంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో వర్షాలు కురవడంతో వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. కె.కోటపాడు మండలంలో 250 ఎకరాలు, చీడికాడ మండలంలో 50 ఎకరాలు, దేవరాపల్లి మండలంలో 150 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తారు. ఇప్పటికే కె.కోటపాడు మండలంలోని 16 రైతు సేవా కేంద్రాల ద్వారా 40 శాతం రాయితీపై 261 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందించారు. ఎకరా పొలంలో ఈ పంటను సాగు చేసేందుకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకూ వ్యయం అవుతుందని, పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటే రూ.30వేల వరకు లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు. మూడున్నర నెలల్లోనే పంట చేతికి అందిరావడంతో పాటు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడంతో సాగుపై మెట్ట ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది కిలో కొనుగోలు ధర రూ.120 ఉండగా ఈ ఏడాది రూ.130 ఉన్నట్టు రైతులు తెలిపారు. రైతుల వద్దకే వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తుంటారు. సాగు సమయంలో రైతులు పాటించాల్సిన సూచనలను మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- రైతులు దుక్కులు నిర్వహించే సమయంలో కలుపు రాకుండా ఉండేందుకు ఎకరానికి కిలో పెండీ మిథలిన్‌ను 200 లీటర్ల నీటిలో వేసి పిచికారీ చేసుకోవాలి.
- ఎకరానికి 60 కిలోల విత్తనాలను నాటాలి.
- విత్తనశుద్ధిని తప్పకుండా చేయాలి. కిలో విత్తనాలకు రెండున్నర గ్రాముల మ్యాంకోజబ్ అనే మిశ్రమాన్ని పట్టించాలి. విత్తనశుద్ధి వల్ల తెగుళ్లను నివారించవచ్చు.
- వరుస విధానంలో నాట్లు వేయడం వల్ల పంటకు గాలి వెలుతురు బాగా లభించి, అధిక దిగుబడి వస్తుంది.
- పంటను రసం పీల్చే పురుగు ఆశించకుండా ఉండేందుకు రైతులు ఎకరానికి 160 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో వేసి పిచికారీ చేయాలి.
- కంచెపంటగా కంది, మొక్కజొన్న, చామంతి మొక్కలను నాటాలి. తద్వారా పంటకు పొగాకు లద్దెపురుగు ఆశించకుండా ఉంటుంది.
- రెండవ గొప్పు(పూతదశ)లో ఉన్న సమయంలో ఎకరానికి 200 కిలోల జిప్సంను వేయడం వల్ల పంటలో నూనెశాతంతో పాటు గింజ పరిమాణం పెరుగుతుంది.
- రబీలో డిసెంబర్ మొదటి వారం నుంచి నెలాఖరులోగా రైతులు తప్పనిసరిగా వేరుశనగ నాట్లను పూర్తి చేయాలి.
- సాగు సూచనలను పాటించి వేరుశనగ సాగును చేపట్టడం ద్వారా ఎకరానికి 750 కిలోల దిగుబడి సాధించవచ్చు

మంచి ఆదాయం వస్తోంది



రబీ సీజన్‌లో ప్రతి ఏటా వేరుశనగ సాగు చేస్తాం. మావి మెట్ట ప్రాంత భూములు కావడంతో పంటకు అనువుగా ఉంటాయి. మంచి ఆదాయం లభిస్తోంది. అర ఎకరా పొలంలో వేరుశెనగ సాగుకు రూ.20వేలు పెట్టుబడి అవుతుంది. పంటకు గత ఏడాది కన్నా ఈ ఏడాది మద్దతు ధర పెరిగింది. పెట్టుబడి పోను మంచి లాభాలు వస్తాయని ఆశతో సాగును ప్రారంభిస్తున్నాం.

–చిరికి గోవింద, వేరుశనగ రైతు, చిరికివానిపాలెం

ఘనంగా తోడపెద్దు పాల అచ్చు కార్యక్రమం



ప్రత్యేక అలంకరణలో తోడపెద్దు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో నూతన తోడపెద్దు పాల అచ్చు కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. సింహాద్రప్పన్న తోడుపెద్దు సేవ గరిడి సంఘం సారధ్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మద్దాల అప్పారావు కుమారుల ఆర్థిక సాయంతో సమకూర్చిన తోడపెద్దుకు ఆ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, దాసుడు వేగి హరికృష్ణకు అప్పగించారు. అనంతరం తోడ పెద్దును వీధుల్లో ఊరేగించారు. సేవ గరిడి సభ్యులు భజన కార్యక్రమంతో పూజలు నిర్వహించారు. తోడ పెద్దుకు నమ్మి కనక వరప్రసాదు అచ్చు వేశారు. వేగి వారి కుటుంబ సభ్యులు గరిడి వద్ద పూజలు చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల: బాల్య వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, కానుపులు సక్రమంగా రాకపోవడంతో పాటు పుట్టే పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. స్థానిక పాల కేంద్రం వద్ద మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్. శ్రీదేవి ఆధ్వర్యంలో మండలంలోని ఆశా, అంగన్‌వాడీ, సచివాలయ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు కిశోరి వికాసం పై శుక్రవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రతి బాలిక ఉన్నత చదువులు చదువుకోవడం వల్ల మంచి సమాజం నిర్మాణమవుతుందన్నారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ మహిళా విద్య వల్ల లాభాలు, బాల్య వివాహాలు వల్ల అనర్థాలు, అక్రమ రవాణా నిరోధక చట్టాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా హక్కులు, ఉన్నత విద్యపై ఎంపీడీవో కొంకి అప్పారావు,స్థానిక జూనియర్ కళాశాల ఉపన్యాసకులు నాగమోహిని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వేమవరపు రామధర్మజ, పుప్పాల అప్పలరాజు, ఐసీడీఎస్ జిల్లా అధికారులు లక్ష్మి, రూప, స్థానిక నాయకులు లెక్కల కాజుబాబు, రొబ్బా మహేష్, రంజిత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు గేటు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన గేటు

నాతవరం: మండలంలో రామన్నపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు మెయిన్‌గేటు ఏర్పాటు చేశారు. గత నెల 28వ తేదీన చెట్ల నీడన భయం భయం అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు నాగ శిరీషా స్పందించి, గేటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిరీషా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఉన్న భారీ టేకు చెట్లను తొలగించాలని ఉన్నతాధికారులు, అటవీశాఖ, రెవెన్యూ శాఖ అధికారులను కోరినట్టు చెప్పారు.

భూమిని రీసర్వే చేసి, న్యాయం చేయాలి

రోలుగుంట: తన భూమిని రీ సర్వే చేసి తనకు న్యాయం చేయాలని అధికారులను కోరినట్టు రత్నంపేట మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. పనసలపాడులో తన పేరున 1.05 ఎకరాలు, తన సోదరుడు తమటపు కోటేశ్వరరావు పేరున 1.75 ఎకరాల భూమి ఉన్నట్టు పేర్కొన్నారు. గ్రామానికి రహదారి కావాలని గ్రామస్తుల అభ్యర్థన, అప్పటి కలెక్టర్ సిఫారసు మేరకు ఏడు సెంట్లు అందజేసినట్టు చెప్పారు. తరువాత మా భూమిని సర్వే జరపకుండా అధికారులు నిలిపివేశారని చెప్పారు. ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అయితే ఇప్పుడు కొంతమంది తాను భూమిని ఆక్రమించుకున్నాని ఆరోపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు రీసర్వే చేసి, తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు



రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



చౌడువాడలో అర్జీ అందజేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ



పైడిపాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు

- తొలిరోజు అంతంత మాత్రంగా స్పందన
- సదస్సుల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపని రైతులు



కొత్తమల్లంపేటలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆర్డీవో వి.వి. రమణ



బేతపూడిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్

బుచ్చెయ్యపేట/దేవరాపల్లి/రోలుగుంట/గొలుగొండ/మాకవరపాలెం/కె.కోటపాడు/నాతవరం/మాడుగుల రూరల్/చీడికాడ: చోడవరం, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాల్లో తొలిరోజు శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదుస్సులు చాలావరకూ మొక్కుబడిగా సాగాయి. అర్జీలు అందజేసేందుకు రైతులు ఆసక్తి చూపలేదు. చాలా సదుస్సుల్లో తక్కువ సంఖ్యలో అర్జీలను అందజేశారు. దీంతో చేసేది లేక అధికారులు తూతూ మంత్రంగా సదుస్సులు నిర్వహించారు. బుచ్చియ్యపేట మండలం మంగళాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కేవలం ఐదుగురు రైతులు మాత్రమే భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. తహసీల్దార్ లక్ష్మి,జిల్లా సర్వే ఏడీ గోపాలరాజు,దేవాదాయశాఖ ఈవో శర్మ,వీఆర్వోలు సుధాకర్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు. దేవరాపల్లి మండలం రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కేవలం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి,డీఎల్‌డీవో మంజులవాణి, మండల సర్వేయర్ జి.గోవిందరాజులు, ఆర్‌ఐ ఎస్.సతీష్, వీఆర్వోలు రమణమ్మ, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, జగదీష్, రామకృష్ణ, స్థానిక నాయకులు చల్లా నాయుడు, చల్లా నానాజీ, పాల్గొన్నారు. గొలుగొండ మండలం కొత్తమల్లంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో నాలుగు అర్జీలను స్వీకరించారు. నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ, తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. డీటీ చైనులు, మండల సర్వేయిర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రోలుగుంట మండలం కుసర్లపూడి సదస్సులో అధికారులు 16 వినతులు స్వీకరించారు. తహసీల్దార్ ఎస్.నాగమ్మ డిప్యూటీ తహసీల్దార్ శంకర్, మండల సర్వేయిర్ తవుటునాయుడు పాల్గొన్నారు. మాకవరపాలెం మండలంలోని పైడిపాల, లచ్చన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రామ్మోహనరావు, డీటీ సోమశేఖర్, ఆర్ఐ జెట్టి, వీఆర్వోలు సూర్యనారాయణ, చిరంజీవి, రమణ పాల్గొన్నారు.

కె.కోటపాడు మండలంలో చౌడువాడలో 10 మంది నుంచి అర్జీలు స్వీకరించారు.పాచిలవానిపాలెంలో సుదీర్ఘకాలంగా రైతుల సాగులో ఉన్న రైత్వారీ ఇనాం భూముల వివరాలను రైతుల పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పాస్ పుస్తకాలను ఇవ్వాలని తహసీల్దార్ భాగ్యావతికి వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, మాజీ వార్డుమెంబర్ గండి సత్యం, కొల్లి రమణ అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారిణి ఆర్.పూర్ణిమాదేవి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, గ్రామ రెవెన్యూ అధికారి పూడి సురేష్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. నాతవరం మండలం ములగపూడిలో శుక్రవారం సర్పంచ్ మార్తీ నాగమణి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ సకాలంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగ శిరీషా, తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యులు తమరాన లోవకృష్ణ, డీటీ శివ, మండల సర్వేయరు ప్రసాద్ పాల్గొన్నారు. మాడుగుల మండలంలో కామకూటం, జాలంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కె.రమాదేవి, మండల సర్వేయర్ జగదీష్, రీసర్వే డీటీ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ మండలంలోని తురువోలు,వీరపురాజుపేట గ్రామాలకు సంబంధించి తురువోలు సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.వి.ఎస్.ఎల్.మూర్తి సర్పంచ్ ఎం.అప్పారావు, తహసీల్దార్ ప్రసాదరావు,హెచ్‌డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



దేవరాపల్లి అంబేడ్కర్ కాలనీలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ



కొత్తకోటలోఅంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు



తామరంలో నివాళులర్పిస్తున్న హరిబాబు



చీడకాడ చావిటి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నాతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



కింతాడ కేజీబీవీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ చిన్నమ్మలు

చోడవరం: అంబేడ్కర్ మార్గం సదా అనుసరణీయమని ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రావికమతం మండలం కొత్తకోటలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం,చోడవరం ఎంపీపీలు పైల రాజు, గాడి కాసు, సర్పంచ్ కోన లోవరాజు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కంచిపాటి జగ్గారావు, గుమ్మిడి సత్యదేవ్, ఉప సర్పంచ్ పందల దేవ, తలారి ఆదిమూర్తి, శీలం గోవింద, ఎంపీటీసీ పూడి దేవ, కుంచా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ ట్రస్ట్ ప్రతినిధులు రిటైర్డ్ జడ్జి సన్యాసిరావు, వేచలపు ప్రకాష్, నడిపూరు దేముడు, యర్రంశెట్టి వరప్రసాద్, కండేల వెంకట్రావు, భూపతిరాజు పైడిరాజు తదితరులు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

నర్సీపట్నం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 40 అడుగుల రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మామిడి శ్రీను, తమరాన శ్రీను, చీటిల రాము, ఈరెల్లి సుధీర్‌కుమార్, ధనిమిరెడ్డి ప్రసాద్, జోజిబాబు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావు, డీఈఈలు సునీల్ కుమార్, త్రినాథ్, అసోసియేషన్ సెక్రటరీ బి.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్‌కు మండలంలోని వాడవాడలా ఘనంగా నివాళులర్పించారు. చీడికాడ చావిటి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పరవాడ మహేష్,మాలమహానాడు నేత గాలి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.వి.రావు మాలమహానాడు నేతలు గాలి రామారావు,పొన్నాడ నాగేష్,కందిపూడి శంకరరావు,వైఎస్సార్‌సీపీ బూడి యువసేన నేతలు మహేష్, గెడ్డంనాయుడు, వెంకటశివకుమార్, బలరాం, గోవింద తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక అంబేడ్కర్ కాలనీ నాలుగు రోడ్ల కూడలిలోగల అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీపీ భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వార్డు సభ్యురాలు కాటపల్లి సృజన తదితర్లు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అప్పారావు, వీర్రాజు, నాగభూషణం, పరవాడ అప్పారావు, మాలిబాబు,దేవుళ్లు, కంచిమాల అప్పారావు పాల్గొన్నారు.

మాకవరపాలెం: తామరంలో అంబేడ్కర్ విగ్రహానికి తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

నాతవరం:అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్ అన్నారు. మండల కేంద్రం నాతవరంలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మాట్లాడారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు బంగారు సూరిబాబు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు చెక్కా జోగిరాజ, నాయకులు చేబ్రోలు అప్పారావు, రామారావు, కె.ప్రభుదాస్, చేపల అప్పారావు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రాజ్యాంగ నిర్మాణకర్త, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కింతాడ కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యపకులు పాల్గొన్నారు.